ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 6 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 గురువారం
సహర్ 5:10 శుక్రవారం



ఓట్లు లెక్కిస్తున్న కౌంటింగ్ సిబ్బంది

- పట్టభద్రుల స్థానంలోనూ కమలానిదే పైచేయి
- రెండో ప్రాధాన్య ఓట్లతో గెలిచిన చిన్నమైల్ అంజిరెడ్డి
- సిట్టింగ్ స్థానాన్ని 'చే'జార్చుకున్న కాంగ్రెస్
- బీఎస్పీకి నిరాశ



విజయసంకేతం చూపుతున్న బండి సంజయ్, అంజిరెడ్డి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య



పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

బీజేపీ డబుల్ ధమాకా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ డబుల్ ధమాకా సాధించింది.ఇప్పటికే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకున్న బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలోనూ పాగా వేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాను తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నానని ఆ పార్టీ చాటుకున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి మూడు ప్రచార సభల్లో ప్రసంగించి వెళ్లినా సిట్టింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేక పోయింది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఇదే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ స్థానంలోనూ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ మరోసారి పట్టునిరూపించు కున్నది. బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డి రెండో ప్రాధాన్య ఓట్లతో ఇక్కడ విజ యం సాధించారు. ఆయనకు సమీప కాంగ్రెస్ అభ్యర్థి కంటే ఓట్ల ఆధిక్యం లభించింది. 56 మంది పోటీ చేసిన ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ నువ్వా..నేనా అన్నట్లు పోటీపడ్డారు. తొలి ప్రాధాన్య ఓట్లతో ఎవరికీ కోటా ఓటు లభించక పోవడంతో ఎలిమినేషన్ పద్దతిలో రెండో ప్రాధాన్య ఓటును లెక్కించి అభ్యర్థి గెలుపును ప్రకటించారు. మొత్తం 2,52,029 ఓట్లు పోల్ కాగా, 28,686 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2,23,343 ఓట్లు చెల్లుబాటు కాగా అభ్యర్థి గెలుపునకు 1,11,672 ఓట్లను కోటా ఓట్లుగా నిర్ణయించారు. తొలి ప్రాధాన్య ఓట్లలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డికి 70,565 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 60,419 ఓట్లు వచ్చాయి. నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డ ముగ్గురు అభ్యర్థులకు 2,06,659 ఓట్లు పోలయ్యాయి. పోటీలో ఉన్న మిగతా 53 మందికి 16,684 ఓట్లు వచ్చాయి. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో గెలుపునకు అవసరమైన కోటా ఓట్లు 1,11,672 ఓట్లు ఎవరికి రాక పోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపును చేపట్టారు. తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి మొదలుకొని ఎలిమినేషన్ చేస్తూ రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ వచ్చారు. అత్యధిక ఓట్లతో మొదటి రెండు స్థానాల్లో ఉన్న బీజేపీ అంజిరెడ్డి, కాంగ్రెస్ నరేందర్‌రెడ్డి మినహా 54 మంది ఎలిమినేట్ అయినా కోటా ఓట్లు ఎవరికీ లభించలేదు. దీంతో ఆ ఇద్దరిలో అత్యధిక ఓట్లు సాధిం చిన బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డిని విజేతగా ప్రకటించారు.



కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న అంజిరెడ్డి, నరేందర్ రెడ్డి, ఇతర అభ్యర్థులు

కౌంటింగ్‌లో ముఖ్యాంశాలు

- మొత్తం ఓట్లు: 3,55,159
- పోలైన ఓట్లు: 2,52,029
- చెల్లని ఓట్లు: 28,686
- గెలుపునకు సాధించాల్సిన కోటా ఓట్లు: 1,11,672

● నాలుగు రౌండ్లలో మినహా అన్నింటిలోనూ బీజేపీదే పైచేయి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈనెల 3న ప్రారంభమై 5వ తేదీ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. మొదటి రోజు చెల్లని ఓట్లను గుర్తించి వాటిని మినహాయించి, 25 ఓట్లకు ఒకటి చొప్పున కట్టలు కట్టడానికే సరిపోయింది. అసలు ఓట్ల లెక్కింపు 4వ తేదీ ఉదయం 11.30 గంటలకు ప్రారంభమై 5వ తేదీ రాత్రి

మిగతా 7వ పేజీలో...

ఇద్దరికీ సమానంగా రెండో ప్రాధాన్య ఓట్లు

మొదటి ప్రాధాన్య ఓట్లతో ఎవరికీ కోటా ఓట్లు దక్కకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి మినహా మిగతా అభ్యర్థులను ఎలిమినేషన్ చేశారు. ఓట్ల లెక్కింపు అనంతరం అంజిరెడ్డి 98,637 ఓట్లతో ముందంజలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి 93,531 ఓట్లతో రెండో స్థానానికి పరిమితమయ్యారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల ద్వారా అంజిరెడ్డికి అదనంగా 22,962 ఓట్లు, నరేందర్ రెడ్డికి 22,966 ఓట్లు లభించాయి. రెండో ప్రాధాన్యంలో నరేందర్‌రెడ్డికి నాలుగు ఓట్లు ఎక్కువ లభించినా మొదటి ప్రాధాన్యంలో సాధించిన ఆధిక్యం కలిసిరావడంతో అంజిరెడ్డి విజయం సాధించారు. అంజిరెడ్డికి 5,106 ఓట్ల మెజారిటీ లభించింది.

● చెల్లని ఓట్లు 28,686

నియోజకవర్గంలో 3,55,159 పట్టభద్రులు ఓటుహక్కు కలిగి ఉండగా 70.48 శాతం పోలింగ్ జరిగింది. 2,50,328 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ ఓట్లను కలుపుకొని 2,52,029 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 2,23,343 ఓట్లు చెల్లగా, నిర్ణీత పద్ధతిలో ఓటు వేయక పోవడంతో 28,686 ఓట్లు చెల్లకుండా పోయాయి. పట్టభద్రుల ఓట్లు కూడా చెల్లకుండా పోవడం చర్చనీయాంశంగా మారింది. 2019లో 1,15,458 ఓట్లు పోల్‌కాగా 9,932 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఈసారి చెల్లని ఓట్ల శాతం గతంలో కంటే పెరిగింది. చెల్లని ఓట్లలో ఎక్కువశాతం కాంగ్రెస్‌వే ఉన్నాయని ప్రచారం జరుగుతున్నది. మూడు పార్టీలకు చెందిన అభ్యర్థులకు కూడా చెల్లని ఓట్లు షాక్ ఇచ్చినట్లు చెబుతున్నారు. చెల్లని ఓట్ల కారణంగానే ప్రసన్న హరికృష్ణ ఓడిపోయారని, బీసీ వాదం ఇక్కడ బలంగా వీచినా చెల్లని ఓట్లే ఆయనను గెలుపునకు దూరం చేశాయని అంటున్నారు.

తొలి ప్రాధాన్య ఓట్లలో ..

బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి	75,675
కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి	70,565
బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ	60,419
ముగ్గురు అభ్యర్థులు సాధించిన ఓట్లు:	2,06,659

పదోన్నతులు, నియామకాల్లో ప్రలోభాలకు లొంగవద్దు

- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం



సఖి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల పదోన్నతులు, నియామకాల్లో ప్రలోబాలకు లొంగవద్దని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అన్నారు. బుధవారం సిరిసిల్లలో అంగన్‌వాడీ హెల్పర్లకు సమావేశం నిర్వహించారు. సఖి పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లక్ష్మీరాజం మాట్లాడుతూ హెల్పర్లలో విద్యార్హతలు ఉండి పదోన్నతులు పొందే అవకాశం ఉన్నవారు ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే మోసపోవద్దని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలని, కేంద్రాల్లో పరిశుభ్రత పాటించి పిల్లలను శ్రద్ధగా చూసుకోవాలన్నారు. గర్భిణి, బాలింతలకు రుచికరంగా భోజనం అందించాలన్నారు. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్లు దివ్య, సుస్మిత, సఖి కోఆర్డినేటర్ రోజా పాల్గొన్నారు.

రుద్రంగి పోలీస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు

- రూ.2 కోట్ల 50 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

రుద్రంగి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి 2కోట్ల 50 లక్షల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రుద్రంగి పోలీస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయవలసిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరగా, రూ.2 కోట్ల 50లక్షలు నిధులు మంజూరుచేశారు. నిధులు మంజూరు చేయడంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నాకు తరలిరావాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న గణేష్

సిరిసిల్ల రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించేలా ముఖ్యమంత్రి దృష్టికి ప్రభుత్వం విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీసుకెళ్లి న్యాయం చేయాలని, అలాగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ సీఐటీయూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు జీపీ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలంటూ గురువారం వేములవాడలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇంటి ఎదుట ధర్నాను చేపట్టనున్నట్లు, దీనికి జిల్లాలోని కార్మికులందరు హాజరుకావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, వర్కోలు మల్లయ్య, బూర శ్రీనివాస్‌గౌడ్, అక్కల అంజాగౌడ్, లోకిని శ్రీనివాస్, సందేల మహేష్, కంసాని రవీందర్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోలోని హామీలు అమలుచేయాలి

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య

సిరిసిల్ల టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయాలని, మంత్రివర్గ విస్తరణలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రిగా అవకాశం ఇవ్వాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య కోరారు. బుధవారం సిరిసిల్ల పట్టణం మున్నూరు కాపు పటేల్ కళ్యాణ మండపంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవన్న అధ్యక్షతన జిల్లా ముఖ్యనాయకుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మున్నూరు కాపు బిడ్డ ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ముఖ్యమంత్రికి పంపిస్తామన్నారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కమిటీ నుంచి కూడా తీర్మానం చేసి ఆరు నెలలు క్రితం మంత్రిగా ఆది శ్రీనివాస్‌కు అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల క్రితం కులగణనలో మున్నూరు కాపులు 28లక్షలు ఉన్నారని చూపించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో కేవలం 13 లక్షల 60వేల మంది మాత్రమే మున్నూరు కాపులు ఉన్నారని చూపించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభా 4 కోట్ల 23 లక్షల మందిలో కేవలం మున్నూరు కాపులు మూడున్నర శాతం ఉన్నట్లు చూపడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మున్నూరు కాపుల జనాభాపై రీసర్వే చేయించాలని సంఘం పక్షాన కోరుతున్నామన్నారు. మున్నూరు కాపుల సంఖ్య అనేది తగ్గిపోయిందని, రచ్చబండ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ 33 జిల్లాల్లోని కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. తెలంగాణ వచ్చాక జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మున్నూరు కాపులు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉండే వారని, ప్రస్తుతం తగ్గిపోయారని అన్నారు. గత ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్, బాలబాలికల వసతిగృహాలు, సంఘాలకు స్థలాలను ఇస్తామని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు నామాల పోశెట్టి, జిల్లా మహిళ అధ్యక్షురాలు కల్లూరి చందన, సిరిసిల్ల, వేములవాడ పట్టణ అధ్యక్షులు అగ్గి రాములు, ఇప్పపూల అజయ్, రుద్రంగి మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి, నిజామాబాద్ మార్కెట్ కమిటి చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, గంభీరావుపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొమిరిశెట్టి విజయ, సిరిసిల్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు, సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు మారం కుమార్, సంఘం జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండ దేవయ్య

తొలిరోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం
- జిల్లాలో 4,064 మంది విద్యార్థులకు 3,932 మంది హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్
8

బైక్‌లు ఇలా.. భక్తులు రావడం ఎలా..?
- పార్కింగ్‌ను తలపిస్తున్న ఆలయ ప్రాంగణం
- ఇబ్బందులు పడుతున్న రాజన్న భక్తులు
7



పన్నుల వసూళ్లకు కసరత్తు..

● జిల్లాలో వసూళ్ల లక్ష్యం రూ.6.42 కోట్లు.. ● ఇప్పటివరకు వసూళ్లు రూ.5.71 కోట్లు..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆస్తి పన్నుల వసూళ్లలో లక్ష్యాన్ని గడువు లోపే పూర్తిచేసి ఈసారి కూడా రాష్ట్రస్థాయిలో రాజన్న సిరిసిల్ల జిల్లాను అగ్రస్థానంలో నిలిపే దిశగా పంచాయతీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామపంచాయతీ పాలక వర్గాలు లేకపోయినా ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా ప్రత్యేక దృష్టి పెట్టారు. వరుసగా కొద్ది సంవత్సరాలుగా వసూళ్లలో జిల్లా అగ్రగామిగానే నిలుస్తోంది.

● మండలాల వారీగా వసూళ్లు..

బోయినపల్లి మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో రూ.36,13,898లకు రూ.29, 02,519 వసూలు చేశారు, చందుర్తి మండ లంలో 19గ్రామ పంచాయతీల్లో రూ.40,70, 551లకు వసూలు రూ.35,37,543, ఇల్లంత కుంట మండలంలో 33 గ్రామపంచాయతీల్లో రూ.46,27,114కు వసూలు రూ.39,28,028, గంభీరావుపేట మండలంలో 21గ్రామ పం చాయతీల్లో రూ.67,12,300కు వసూలు 63,82, 958, కోనరావుపేట మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో రూ.42,51,592కు వసూలు రూ.38,82,312 ముస్తాబాద్ మండలంలో 22గ్రామ పంచాయతీల్లో రూ.91,77, 679కు వసూలు రూ.82,29,744, రుద్రంగి మండలలో 10గ్రామపంచాయతీల్లో రూ.25, 13,447కు వసూలు రూ.23,52,895, తంగళ్లపల్లి మండలంలో 30 గ్రామ పంచాయతీల్లో రూ.84,89,292కు వసూలు రూ.67,05,739, వీర్నపల్లి మండలంలో 17 గ్రామపం చాయ తీల్లో రూ.11,94,157కు వసూలు రూ.11, 94,157, వేములవాడ మండలంలో 11గ్రామ పంచాయతీల్లో రూ.69,47,538కు వసూలు రూ.56,07,772, వేములవాడ రూరల్ మండ లంలో 17గ్రామపంచాయతీల్లో రూ.21,59, 493కు వసూలు రూ.19,60,713, ఎల్లారెడ్డి పేట మండలంలో 24 గ్రామపంచాయతీల్లో రూ.1,04,97,849కు రూ.1,04,97,849 పన్నుల ను వసూలు చేశారు. మిగిలిన వసూలుకు కసరత్తు చేస్తున్నారు.

● లక్ష్యం రూ 6.42 కోట్లు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామ పంచాయతీల పరిధిలో వందశాతం పన్నుల లక్ష్యాన్ని పూర్తిచేసే దిశగానే అడుగులు పడుతున్నాయి. జిల్లాలోగల 12 మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్నుల్లో రూ.6 కోట్ల 42 లక్షల 54 వేల 910 వసూలు లక్ష్యం ఉంది. ఇప్పటివరకు రూ.5కోట్ల 71 లక్షల 82 వేల 229 వసూలు చేశారు. ఇంకా కేవలం రూ.70 లక్షల 72 వేల 681 వసూలు చేయాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే ఎల్లారెడ్డి పేట, వీర్నపల్లి మండలాలు వంద శాతం లక్ష్యాన్ని సాధించాయి.

రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న కేటీఆర్..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మల్కపేట రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ అంటేనే కాళేశ్వరం అని అంటూ కేటీఆర్ రైతులను మభ్యపెడుతూ మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ అలానే ఉంటే సిరిసిల్ల పరిధిలోని గిరిజన తండాకు సాగునీరు అందించే వాడని కేటీఆర్ పిట్టకథలు చెబుతున్నాడని అన్నారు. పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉంటూ సిరిసిల్ల నియోజకవర్గంలో ఏ ఒక్క గుంటకు కూడా నీరు అందించలేదన్నారు. వేసవిలో నీరు అందించి రైతులను ఆదుకోవాలని చెప్పిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి ఉమ్మడి జిల్లా మంత్రులతో మాట్లాడి గిరిజన తండా గుట్టల వరకు కాలువ ద్వారా నీరు అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మల్కపేట రిజర్వాయర్‌కు బాకాయి పెట్టిన 11 కోట్ల డబ్బులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చాడన్నారు. రైతులకు ఎల్లంపల్లి ద్వారా నీరందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ కచకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా తోపాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీని అమలుచేయాలి

- బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్

సిరిసిల్ల రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుతోపాటు రూ.4వేల ఆసరా పెన్షన్‌ను అమలు చేయాలని బీడి వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా భవనంలో బుధవారం జరిగిన బీడీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా బీడీ కార్మికులందరికీ 4 వేల పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా కూడా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. పెన్షన్ బీడీకార్మికులకు అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యజమానుల లాభం చేకూర్చే చర్యలు తీసుకుంటోందని, రాష్ట్రంలో లక్షలాదిమంది బీడీ పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న వారిపై నిర్లక్ష్య వైఖరి మానుకోవాలన్నారు. వెంటనే కనీస వేతనం చట్టం అమలు చేయాలని అన్నారు. సమావేశంలో బీడీవర్కర్స్ యూనియన్ నాయకులు దాసరి రూప, బెజిగం సురేష్, జిందం కమలాకర్, రైసా బేగం, సబ్బని శాంతమ్మ, కొక్కుల యశోద, బోడ శోభ, పద్మ, కస్తూరి విజయ, సుజాత, సౌర్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వలస కార్మికుడి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్‌లోని అన్నపూర్ణరక్ష బ్రిక్స్‌లో వలసకార్మికుడు పప్పులు నిషాంత్ (42) బుధవారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం ఒడిశా రాష్ట్రం నుంచి బతుకు దెరువు కోసం జిల్లాలోని రంగాపూర్ ఇటుక బట్టీలో పనిచేసేందుకు వచ్చాడు. మంగళవారం ఎప్పటిలాగే పనులు ముగించుకొని గదిలోకి వెళ్లి నిద్రించినట్లు తెలిపారు. బుధవారం పనికి రాకపోయేసరికి గదికి వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నట్లు తెలిపారు. తోటికార్మికుడు జ్యోతిబడి చందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ అర్.స్వామి తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి


లలిత (ఫైల్)

సారంగాపూర్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామల వేధింపులు భరించలేక సారంగాపూర్ మండలం రంగపేట గ్రామంలో పురుగుల మందు తాగిన లలిత(40) అనేవివాహిత చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు రంగపేట గ్రామానికి చెందిన తుమ్మల చిరంజీవికి లలితతో 15సంవత్సరాలక్రితం వివాహం జరిగింది. భర్త, అత్తమామలు లలితను వేధింపులకు గురిచేస్తుండటంతో ఈనెల1న పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై దత్తాద్రి పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య


పురుషోత్తం(ఫైల్)

మల్లాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామానికిచెందిన మామిడి పురుషోత్తం(34) అనేవ్యక్తి ఆర్థికసమస్యలతో బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. మామిడి పురుషోత్తం కొంత కాలం కింద జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి వచ్చాడు. ఉన్న కొద్దిపాటి పొలం సాగుతో గల్ఫ్‌కు వెళ్లడానికి చేసిన అప్పులు తీర్చలేక మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతిడికిభార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

యువతి బలవన్మరణం

కోరుట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని రవీంద్ర రోడ్డుకు చెందిన పల్లికొండ రోహిత (22) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రోహితకు కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామశివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో గాజుల శ్రీనివాస్ (45) అనేవ్యక్తి మృతిచెందాడు. శ్రీనివాస్ కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. గోదావరిఖని మంథని ప్రధాన రహదారిపై బుధవారం కాలినడకన గ్రామానికి వెళ్తుండగా గోదావరిఖని నుంచి మంథని వైపు వెళ్తున్న లారీ శ్రీనివాస్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్ అక్కడికక్కడే మరణించాడు. మృతుడిసోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదుమేరకు డ్రైవర్ రాజయ్యపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు తెలిపారు.

స్వగ్రామానికి చేరిన విద్యార్థి మృతదేహం

● అంత్యక్రియల్లో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

ముస్తాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేరళలో జరిగిన హౌజ్‌బోట్ ప్రమాదంలో ముస్తాబాద్‌కు చెందిన ఓ బీటెక్ విద్యార్థి సోమవారం మరణించగా బుధవారం ఉదయం స్వగ్రామానికి చేరుకుంది. ముస్తాబాద్‌కు చెందిన ముత్యాల దేవేందర్, శారదల ఒక్కాగానొక్క కొడుకు ముత్యాల సాయిచరణ్(22) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి కేరళ టూర్‌వెళ్లిన సాయిచరణ్ అల్లాపూజలో హౌజ్‌బోట్ తీసుకొని రాత్రి ప్రయాణం చేశారు. రాత్రి సమయంలో సాయి ప్రమాదవశాత్తు కాలు జారి బోట్ నుంచి నీళ్లలో పడి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిర్వహించారు. బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకోగానే తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండీ సర్వర్‌పాషా, డాక్టర్ చంద్రశేఖర్‌రావు, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, కెజె ప్రకాశ్ తదితరులు పరామర్శించారు.

నిద్రిస్తున్న భక్తులపైకి దూసుకెళ్లిన కారు

● ముగ్గురికి తీవ్రగాయాలు

వేములవాడ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయగుడి చెరువులోని పార్కింగ్‌స్థలంలో నిద్రిస్తున్న భక్తులపైనుంచి కారు దూసుకువెళ్లడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నల్లగుట్టతాండకు చెందిన భక్తులు రాజన్న దర్శనానికి గత ఆదివారం రాజన్న ఆలయానికి వచ్చారు. రాజన్న దర్శనం అనంతరం ఆలయపార్కింగ్ స్థలంలో విడిది చేశారు. అర్ధరాత్రి పార్కింగ్ స్థలంలో నిద్రిస్తున్న భక్తులపైకి మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కారుని ఒక్కసారిగా తీసుకెళ్లాడు. ఈ సంఘటనలో కమిలి, అనిత, రవికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. పోలీసులను వివరణ కోరగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేధింపుల కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

జగిత్యాలక్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని వెంటపడి వేధించి బాలిక ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఎట్టెం రవి(22) ఓ బాలికను ప్రేమిస్తున్నానని వేధించాడు. దీంతో ఆ బాలిక 2022లో తీవ్రమనస్థాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక కటుంబసభ్యులు అదేరోజు పెగడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శ్వేత కేసు నమోదు చేశారు. కోర్టుడ్యూటీ అధికారులు ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుళ్ల సాగర్, శ్రీధర్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి రవికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అభినందించారు.

మార్కెట్‌కు రాని కందులు

● జిల్లాలో గంగాధరలోనే అధికంగా కంది సాగు

● పత్తిలో అంతరపంటగా సాగు చేసిన రైతులను గుర్తించని అధికారులు

● నెల రోజుల క్రితమే ప్రైవేటుగా అమ్మకాలు



గంగాధర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆశించిన పెట్టుబడులు రాని కారణంగా కొన్నేళ్లుగా రైతులు కందిసాగుపై విముఖత చూపుతు న్నారు. ఈ సీజన్‌లో జిల్లాలోనే గంగాధరలో ఎక్కువ విస్తీర్ణంలో కంది సాగైంది. అయినా కందుల సేకరణకు అధికారులు ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. గంగాధర మండలంలోని మార్కెట్ యార్డులో గత నెల19న మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా డీసీఎంఎస్ వారు కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 14మండలాల్లో రైతులు 897.29 ఎకరాల్లో కందిసాగు చేశారు. ఒక్క గంగాధర మండలంలోనే 411.01 ఎకరాల్లో కంది సాగు చేశారు. దీనితో అదికారులు 2466.06క్వింటాళ్ల కందుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.


గంగాధర మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన కందులు

మండలంలోని బూరుగుపల్లి, నర్సింహులపల్లి, ర్యాలపల్లి, సర్వారెడ్డిపల్లి, గంగాధర, ఇస్లాంపూర్, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, గర్షకుర్తి, గట్టుబూత్కూర్, ఒద్యారం, కురిక్యాల, ఉప్పరమల్యాల, ఆచంపల్లి, కాచి రెడ్డిపల్లి, కొండన్నపల్లి, మల్లాపూర్, వెంకంపల్లి గ్రామాల్లో 646మంది రైతులు కందిసాగు చేశారు. గతనెలలో ప్రారంభించిన కంది కొనుగోలు కేంద్రానికి రెండు రోజుల క్రితం కేవలం 50క్వింటాళ్ల కందులు విక్రయానికి రైతులు తీసుకువచ్చారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.7550 చెల్లిస్తున్నారు.

ఇవేం కొర్రీలు..

గంగాధర మండలంలో కందిసాగు రైతులు కేంద్రానికి దినుసులు తీసురావడానికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వ్యవ సాయ శాఖ అధికారులు ఆయాగ్రామాల్లో తిరిగి రైతులు సాగు చేసిన పంటల వివ రాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. అయితే మండలంలోని రోడ్డుకు ఇవతలివైపు ఎక్కువగా పత్తి సాగుచేస్తారు. పత్తి సాగులో అంతర పంటగా కంది సాగు చేశారు. వ్యవసాయాధికారులు ఈ రైతులను పత్తిరైతు కిందనే గుర్తించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేశారు. ఇప్పుడు కందులు అమ్ము కుందామంటే మార్క్‌ఫెడ్ అధికారులకు అందించిన లిస్టులో వీరిపేర్లు కనిపించటంలేదు.

దీంతో మండలంలోని కాసారాం, గోపాల్‌రావుపల్లి, మల్లాపూర్, నాగిరెడ్డిపూర్, ఇస్లాంపూర్, వెంకంపల్లి గ్రామాల రైతులు అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. లిస్టులో పేర్లు లేకపోవడంతో వ్యవసాయ కార్యాలయం చుట్టూ అధికారుల ధ్రువీకరణ కోసం తిరుగుతూనే ఉన్నారు.

వ్యవసాధికారుల ధ్రువీకరణ పత్రం ఉంటేనే కందులు కొనుగోలు చేస్తామని మార్క్ ఫెడ్ అధికారులు తెలపడంతో కందులు ఎక్కడ అమ్ముకోవాలోనని రైతులు తలపట్టుకుంటున్నారు. అదీగాక అధికారుల సర్వే ప్రకారం 2466క్వింటాళ్ల కందుల దిగుబడి రావాల్సి ఉండగా కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి ఇరవై రోజుల్లో కేవలం 50క్వింటాళ్ల కందులు మాత్రమే మార్కెట్‌కు వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే ఇప్పటికే రైతుల వద్దనుంచి ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు జరిపినట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం బహిరంగా మార్కెట్లో ప్రైవేటు వ్యక్తులు క్వింటాళలకు రూ.6వేలు చెల్లిస్తుండగా ప్రభుత్వం 7550 చెల్లిస్తోంది. ఇప్పటికైనా రైతులు కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని అధికారులు కోరుతున్నారు. మరోవైపు పత్తిపంటలో అంతర పంటగా వేసిన కంది రైతుల దినుసులను కొర్రీలు లేకుండా కొనుగోలు జరపాలని రైతులు కోరుతున్నారు.

ప్రాచీన పునాదులపైనే ఆధునిక భాషా వికాసం

● ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన పునాదులపైనే ఆధునిక భాషా వికాసం ఆధారపడి ఉందని శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఎస్సారార్ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సును 'తెలంగాణ ప్రాచీన వాఙ్మయం- అవలోకనం' అనే అంశంపై కళాశాల తెలుగు విభాగం, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ మాట్లాడితేనే భాషలు మనుగడలో ఉంటాయని అందరం తెలుగులో మాట్లాడితేనే తెలుగుభాష కలకాలం వర్ధిల్లుతుందని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ తొలితెలుగు కంద పద్యాన్ని గుండెల మీద మోస్తున్న కరీంనగర్ గడ్డమీద ఈసదస్సును నిర్వహిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. తెలంగాణ ప్రాచీన వాఙ్మయం మహోత్కృష్టమైనదని ఈసదస్సు వేదికగా ఆ మహాకవులను, వారి గ్రంథాలను స్మరించుకోవడం అదృష్టం అన్నారు. సదస్సు ప్రాయోజకులు, ప్రాచీనతెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుభాషా వికాసానికి జరిగే కార్యక్రమం ఏదైనా నిర్వహించడానికి ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు ముందుంటుందని అన్నారు. ప్రముఖ చారిత్రక పరిశోధకులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి బొమ్మలమ్మగుట్టలో ఉన్నటు వంటి త్రిభాషా శాసనంలో ఉన్న పద్యాలే తెలుగు ప్రాచీన హోదాకు ఆధారాలని వివరించారు. అందుకు కరీంనగర్‌వాసులు గర్వించాలని అన్నారు. ఈ జాతీయ సదస్సులో దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి ఔత్సాహికపరిశోధకులు సుమారుగా 70మంది తమ పరిశోధకపత్రాలను సమర్పించడానికి వచ్చారని తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ తెలిపారు. డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ సంగనభట్ల నరసయ్య, విశ్రాంతప్రాచార్యులు సభాధ్యక్షులుగా డాక్టర్ సిహెచ్ లక్ష్మణ్ చక్రవర్తి ప్రధానవక్తగా పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్

మంథని, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మంచిర్యాలకు చెందిన సింగరేణి రిటైర్డు ఉద్యోగి పోల్సాని చంద్రశేఖర్‌రావు, మంథనికి చెందిన పరంకుశం వెంకటస్వామిలను మంథని తహసీల్దార్ ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. చంద్రశేఖర్‌రావు, వెంకటస్వామిలు బట్టుపల్లి గ్రామానికి చెందిన మేకల మధునయ్య వద్దకు వచ్చి తమకు తెలిసిన వ్యక్తిఅకౌంట్‌లో రూ.38వేలకోట్లు ఉన్నాయని, ఆ డబ్బులు రిలీజ్ చేయటానికి ట్యాక్స్ కట్టాలని, ట్యాక్స్ చెల్లించడానికి రూ.లక్ష ఇస్తేతిరిగి రూ.కోటి ఇస్తామని తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన మధునయ్య తమకు సమాచారం ఇవ్వడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించిన అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలో బుధవారం పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో ఉన్న 170కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. సుల్తానాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్, ఓనర్ పర్వతం ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ఓదెల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,400, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ కనుకయ్య, శంకరయ్య, రాజు, సంధాని, వెంకయ్య, అనిల్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఏఎస్‌ఐ రత్నాకర్, హెడ్ కానిస్టేబుల్ కిషన్, కానిస్టేబుల్స్ అశోక్, రమేష్ పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్



దొంగ అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

ముస్తాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలంలోని పలు ఆలయాల్లో దొంగతనాలు చేసిన వ్యక్తిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ గణేష్ తెలిపారు. ముస్తాబాద్ మండలం తెర్లమద్ది గ్రామానికిచెందిన మామిండ్ల అంజనేయులు మండలంలోని గూడూరు, మొర్రాయిపల్లె గ్రామాల్లోని దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

ఏసీబీ వలలో కోరుట్ల ఎస్సై

● ఒకరి నుంచి రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత


పట్టుబడిన కోరుట్ల ఎస్‌ఐ శంకర్


బాధితుడు బండారి శ్రీనివాస్

కోరుట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పేకాటరాయుడి నుంచి ఐదు వేల రూపాయలు లంచం తీసుకుంటూ కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో మూడవ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్‌ఐ శంకర్ బుధవారం ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. కోరుట్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ శంకర్‌కు బాధితుడు శ్రీనివాస్ డబ్బులు అందిస్తుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల మండలం జోగినిపల్లి, పైడిమడుగు గ్రామశివారులో ఫిబ్రవరి 21న రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్‌తో పాటు మరో ఏడుగురిని జగిత్యాల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నారు. అనంతరం వారిని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి కేసునమోదు చేయించారు. ఈక్రమంలో పేకాట ఆడుతున్న వారి సెల్‌ఫోన్లను కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేసుకున్నారు. ఆధార్‌కార్డు తీసుకు వచ్చి సెల్‌ఫోన్ తీసుకెళ్లాలని తెలపగా పేకాటాడుతూ దొరికిన ఏడుగురువ్యక్తులు ఫోన్లు తీసుకెళ్లారు. ఫిబ్రవరి 22న శ్రీనివాస్ కూడా ఫోన్ తీసుకెళ్లడానికి పోలీస్ స్టేషన్‌కు రాగా ఎస్‌ఐ రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో శ్రీనివాస్ తనపై కేసు నమోదు చేశారని, డబ్బులు ఎందుకు ఇవ్వాలని ఎస్‌ఐని ప్రశ్నించాడు. శ్రీనివాస్‌కు సెల్‌ఫోన్ ఇచ్చిన ఎస్‌ఐ శంకర్ అప్పటి నుంచి ఫోన్ ద్వారా డబ్బులు ఇవ్వాలని వేధించడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ చందర్‌ల సూచనల మేరకు శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ శంకర్‌కు రూ.5000 లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శంకర్‌ను అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్ట్

● రూ.64 వేల విలువైన వెండి, ఇత్తడి సామగ్రి స్వాధీనం

● పరారీలో మరో నిందితురాలు ● వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ


నిందితుడి అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో పలు ఆలయాల్లో చోరీకి పాల్పడ్డ నిందితుడు విబూది శేఖర్(22) జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. డీఎస్పీ రఘుచందర్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన శేఖర్ జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో నివాసం ఉంటున్నాడు. లక్ష్మి అనే మరో మహిళతో కలిసి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. పట్టణంలోని చిన్న కెనాల్ సమీపంలో బుధవారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో శేఖర్ తన చేతిలో ఉన్న సంచితో అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో జిల్లాకేంద్రంలోని ఉప్పరి పేటలో ఉన్న దాసాంజనేయ స్వామి ఆలయం, శంకులపల్లి సమీపంలో ఉన్న నల్ల పోచమ్మ ఆలయంతో పాటు కోరుట్లలోని మరో ఆలయంలో ఉన్న వెండి, ఇత్తడి, రాగి రూ.64,600 విలువగల తదితర వస్తువులు దొంగతనం చేసినట్లు డీఎస్పీ రఘచందర్ వివరించారు. నిందితుడి వద్ద వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. శేఖర్‌తో పాటు దొంగతనానికి పాల్పడ్డ లక్ష్మి అనే మరో మహిళ పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితుడిపై ఎనిమిది సంవత్సరాలుగా 25 దొంగతనాల కేసులు ఉండడంతో సస్పెక్ట్ షీట్ కూడా ఓపెన్ చేసి జైలుకు పంపామన్నారు.

జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పాటు నర్సింగ్ కళాశాలలో దొంగతనానికి పాల్పడిన బాల నేరస్థుడిని కూడా పోలీసులు పట్టుకుని జువైనల్ హోంకు తరలించారు. ఈ సమావేశంలో టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణు గోపాల్, ఎస్సై కిరణ్ కుమార్ ఉన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామశివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పింది. ఈ సంఘటనలో మండలంలోని రాగట్లపల్లికి చెందిన చెరుకు బాలమల్లు, మందాటి దేవయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లోసిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలమల్లు, దేవయ్యలు తమ బైక్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వెంకటాపూర్ గ్రామ శివారులోని మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.


విదేశాలకు పంపిస్తానని రూ.కోటి టోకరా

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

మల్యాల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మల్యాలకు చెందిన ఓవ్యక్తి జార్జియా, మాల్టా తదితర దేశాలకు పంపిస్తానని 20మందినుంచి కోటి రూపాయలు వసూలు చేశాడు. విదేశాల్లో నెలకు రూ.లక్షపైన జీతం ఉంటుందని ఆశచూపి మల్యాలతోపాటు జిల్లాలోని పలువురుయువకులు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరికొందరి వద్ద డబ్బులు వసూలుచేసి పంపిచకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. మాల్టాకు వెళ్లేందుకు మూడు నెలలుగా తాము ఢిల్లీలో ఉండి అనేక ఇబ్బందులు పడ్డామని పలువురు బాధితులు తెలిపారు. కొన్నాళ్లపాటు తమతోనే ఉన్న ఏజెంట్ మహాశివరాత్రి మరుసటిరోజు నుంచి తమకు కనిపించ కుండా వెళ్లడంతో మోసపోయామని తెలుసుకొని ఢిల్లీ నుంచి బుధవారం మల్యాలకు చేరుకున్నట్లు తెలిపారు. న్యాయం చేసి సదరు ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

పూడూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి జాతీయస్థాయి గుర్తింపు

● ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపిక


పూడూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం

కొడిమ్యాల, మార్చి5 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. గర్భిణులు, చిన్నారులపై తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ, కుటుంబ నియంత్రణ లాంటి సేవలు అందించినందుకు పూడూర్ ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌ను నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఏఎస్)కు కేంద్ర బృందం ఎంపిక చేసింది. దీంతో పూడూర్‌కు ప్రత్యేక నిధులు విడుదల కానుండడంతోపాటు పలురకాల వసతులు కల్పించనున్నారు. గత జనవరి 24న పూడూర్‌ను జాతీయ స్థాయి బృందం సందర్శించింది. ఆరోగ్య కేంద్రంలోని రిజిస్టర్లను పరిశీలించింది. వైద్య సిబ్బందిని పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. దీంతో సంతృప్తిని వ్యక్తం చేసిన జాతీయ స్థాయి బృందం పూడూర్‌ను ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపిక చేసింది. ఈమేరకు జాతీయ స్థాయి నుంచి వచ్చిన ఉత్తర్వులను జగిత్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ కె ప్రమోద్‌కుమార్ మండల వైద్యాధికారికి పంపించారు. ఇందుకు కృషిచేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్‌కు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ. శ్రీనివాస్‌కు, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జైపాల్‌రెడ్డిలకు మండల వైద్యాధికారులు పరమేశ్వరీ, నరేష్, సీహెచ్‌వో రాజశేఖర్, ఎన్.క్యూ.ఏ.ఎస్ జిల్లా మేనెజర్ నాగరాజు, ఏఎంవో సత్యనారాయణకు డీఎంహెచ్‌వో అభినందనలు తెలిపారు.

బీజేపీ డబుల్ ధమాకా

(5వ పేజీ తరువాయి)

వరకు ఉత్కంఠ భరితంగా కొనసాగింది. చెల్లిన ఓట్లు 2,23,343 కాగా వీటిని 11 రౌండ్లలో లెక్కించారు. తొలి ఐదు రౌండ్లలో బీజేపీ ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చింది. ఆరు నుంచి తొమ్మిది రౌండ్ల వరకు కాంగ్రెస్ పై చేయిగా నిలువగా మళ్లీ 10, 11 రౌండ్లలో బీజేపీ ఎక్కువ ఓట్లను తెచ్చుకొని మొదటి ప్రాధాన్య ఓట్లలో 5,110 ఆధిక్యాన్ని సాధించింది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ ముగ్గురు ప్రధాన అభ్యర్థులకు నువ్వా..నేనా అన్నట్లుగానే ఓట్లు వచ్చాయి. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే నరికి తొలి ప్రాధాన్య ఓట్ల ఆధిక్యత కంటే ఓట్లు పెరిగి అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675 మొదటి ప్రాధాన్య ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 70,565, ప్రసన్న హరికృష్ణకు 60,419, యాదగిరి శేఖర్‌రావుకు 3,636, ముస్తాక్ అలీకి 2,701, సర్దార్ రవీందర్‌సింగ్‌కు 2,047 మొదటి ప్రాధాన్య ఓట్లు లభించాయి.

● సిట్టింగ్ స్థానం 'చే'జారింది..

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత టి జీవన్‌రెడ్డి ఉన్నారు. ఆయన ఈసారి పోటీకి సుముఖంగా లేక పోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డిని అభ్యర్థిగా బరిలోకి దింపింది. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. బీజేపీ సి అంజిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. 56 మంది పోటీలో ఉన్నా ఈ ముగ్గురు మధ్యే ప్రధాన పోటీ జరిగింది. హోరాహోరీగా సాగిన పోరులో కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోగా, బీజేపీ ఊహించని విధంగా విజయం సాధించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార గడువు ముగియడానికి ఒక రోజు ముందు నియోజకవర్గంలోని నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రచారం నిర్వహించారు. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నా, మిత్రపక్షంగా సీపీఐ మద్దతు ప్రకటించినా కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోలేక పోయింది. ఇదే నియోజకవర్గ పరిధిలో ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలను కలిగి ఉన్న బీజేపీ అందరికంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించినా ఆలస్యంగా ప్రచారంలోకి దిగింది. అయినా అనూహ్యంగా పోటీ ఇచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకొని ఈ ప్రాంతంలో తన పట్టును మరింత పెంచుకున్నది. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలపక పోలింగ్‌కు ఒక రోజు ముందు బీసీ అభ్యర్థికి ఓటు వేయమని ఆ పార్టీ నాయకులు వివిధ ప్రాంతాల్లో ప్రకటనలు చేశారు.

వీడిన ఉత్కంఠ


ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు


కౌంటింగ్ హాలు నుంచి బయటకు వస్తున్న నరేందర్‌రెడ్డి


ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

- మూడో రోజు ఫలితం వెల్లడి
- బీజేపీ శ్రేణుల్లో జోష్
- కాంగ్రెస్, బీఎస్పీకి నిరాశ
- భావోద్వేగానికి గురైన నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు మూడవ రోజు ముగిసింది. నువ్వా..నేనా అన్న రీతిలో జరిగిన బిగ్‌ఫైట్‌లో బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి అనూహ్య విజయం సాధించారు. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో కోటా ఓట్లు రాక పోవడంతో బుధవారం రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేషన్ పద్ధతిలో తొలగిస్తూ వారిలో రెండో ప్రాధాన్యత ఓటు వేసిన వాటిని చూసి బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థుల ఖాతాల్లో జమ చేశారు. పోలింగ్‌లోనే కాకుండా ఓట్ల లెక్కింపులో కూడా ఉత్కంఠ పోరు సాగింది.

చివరకు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. ఇప్పటికే ఈ నియోజక వర్గంలోని ఉపాధ్యాయ స్థానాన్ని గెలుచుకున్న బీజేపీ, పట్టభద్రుల స్థానాన్ని కూడా కైవసం చేసుకోవడంతో పార్టీశ్రేణుల్లో ఉత్తేజం, ఉత్సాహం నెలకొంది. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలిచినట్లు తెలిసిన వెంటనే ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకొని సంబురాలు జరుపుకున్నారు.

కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాత్రి 8.30 గంటల ప్రాంతంలో కౌంటింగ్ కేంద్రానికి రాగానే పార్టీ నాయకులు, కార్యకర్తలు సంజయ్ నాయకత్వం జిందాబాద్.. బీజేపీ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ఆయనను వారి భుజాలపై ఎక్కించుకొని నృత్యాలు చేశారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డికి 70,565, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 60,419 ఓట్లు వచ్చాయి. 2,23,343 ఓట్లు పోల్‌కాగా, వాటిలో 28,686 చెల్లని ఓట్లు ఉన్నాయి. చెల్లుబాటైన ఓట్లలో సగానికి ఒక ఓటు కలిపి కోటా ఓట్లుగా 1,11,672 నిర్ణయించారు. కోటా ఓట్లురాక పోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు చేపట్టారు. ముగ్గురు అభ్యర్థులు రెండో ప్రాధాన్య ఓట్లపై ఆశలు పెట్టుకొని లెక్కింపును నిశితంగా పరిశీలించారు. 53 మందిని ఎలిమినేషన్ పద్ధతిలో తొలగించినప్పటికీ కోటా ఓట్లు రాకపోవడంతో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను ఎలిమినేషన్ చేస్తూ ఆయన బ్యాలెట్‌లోని రెండో ప్రాధాన్య ఓట్లను బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు కలుపుతూ వచ్చారు. ఎలిమినేషన్ అయిన వెంటనే ప్రసన్న హరికృష్ణ నిరాశతో వెళ్లిపోయారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఉత్కంఠతో ఫలితాల కోసం నిరీక్షించారు. చివరకు బీజేపీ అభ్యర్థి విజయం సాధించడంతో కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి తీవ్ర భావోద్వేగానికిలోనై కంటతడిపెడుతూ వెళ్లిపోయారు.

ఉద్యోగంలో చేరను.. రాజకీయాల్లోనే ఉంటా


విలేకరులతో మాట్లాడుతున్న ప్రసన్నహరికృష్ణ

కరీంనగర్ అర్బన్/టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తాను తిరిగి ఉద్యోగంలో చేరే ప్రసక్తే లేదని, తనను నమ్ముకున్న వ్యక్తుల సమస్యల పరిష్కారానికి కొట్లాడుతూ రాజకీయాల్లో కొనసాగుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ స్పష్టం చేశారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం మూడో స్థానంలో ఉన్న బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎలిమినేషన్ మొదలు పెట్టగానే కౌంటింగ్ కేంద్ర బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తనను ఓడగొట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఒక్కటయ్యారని విమర్శించారు. ఓటర్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా 63వేలకు పైగా ఓట్లు తెచ్చుకున్నానని చెప్పారు. ప్రసన్న హరికృష్ణను అడ్డుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మూడు సభలు పెట్టారని అన్నారు. తన నామినేషన్‌ను అడ్డుకునేందుకు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రయత్నం చేశారని విమర్శించారు. ఏడునెలలుగా తన కోసం కష్టపడిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ గెలుపు కాంగ్రెస్‌కు రంజాన్ గిఫ్ట్

- డబ్బులు పంచిన గూగుల్ పే లెక్కలన్నీ తీస్తాం
- దమ్ముంటే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్‌కు సవాల్
- ఎమ్మెల్సీ ఛాంపియన్స్ ట్రోఫీ బీజేపీదే
- తెలంగాణలో కాంగ్రెస్‌పై యుద్ధభేరి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


అంజిరెడ్డికి స్వీట్ తినిపిస్తున్న ఆయన సతీమణి, పక్కన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ నాయకులు

కరీంనగర్‌అర్బన్/భగత్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజం కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ గెలుపుతో రంజాన్ గిఫ్ట్ ఇచ్చిందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టభద్రుల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి గెలుపొందడంతో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించిన బండి సంజయ్‌కుమార్ అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు గుణపాఠమన్నారు. ముస్లింలంతా బీజేపీని ఓడించాలని చూస్తే హిందు సమాజమంతా కాంగ్రెస్‌ను ఓడించిందన్నారు. నోట్లు పంచిన వారిని వదిలిపెట్టేది లేదని, గూగుల్‌పే లెక్కలన్నీ తీస్తామన్నారు. నరేంద్ర మోదీ నీతినిజాయితీ పాలనను, తెలంగాణకు కేంద్రం కేటాయించిన నిధులను ఓటర్లు గుర్తించారన్నారు. బీజేపీ కార్యకర్తలు ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు బీజేపీ చేసిన పోరాటాలను గుర్తుంచుకుని తమను ఆదరించారని తెలిపారు.

మోదీ బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను రాయితీపై ఉపాధ్యాయులు, పట్టభద్రులు విశ్వాసం చూపించారన్నారు. మొన్న ఛాంపియన్స్ ట్రోఫీలో విజయం సాధించామని, తమది ఇండియా టీం అని విజయం సాధించి తీరుతామని చెప్పామన్నారు. నోట్ల సంచులు ఓడిపోయాయని, ఓటర్లే గెలిచారన్నారు. ఈవీఎంలను మేనేజ్‌చేసి బీజేపీ గెలుస్తుందని పదేపదే రాహుల్‌గాంధీ దుష్ప్రచారం చేసినా బ్యాలెట్‌ద్వారా నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి చూపించామన్నారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేసినా, ఓటుకు ఐదు వేలు పంచినా వారి కుట్రలు ఫలించలేదన్నారు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ రెండో స్థానంలో ఉంటారని భావించామని, బీఆర్ఎస్ నేతల మద్దతివ్వడంతోనే ఆయన మూడో స్థానానికి పరిమితమయ్యాడని తెలిపారు. మార్పు కోరుతున్న ప్రజలకు బీజేపీ దిక్సూచిలా కనిపించిందన్నారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి అంతా కేంద్రం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తామే చేస్తున్నామని ప్రచారం చేసుకుంటుందన్నారు. రాష్ట్రంలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లు రాష్ట్ర ప్రభుత్వ పాలనపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ తీర్పు ఇచ్చారన్నారు. ఆరు గ్యారెంటీలు, రెండు లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, జీపీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. రైతులు, మహిళలకు ఇచ్చిన హామీలన్ని అమ లు చేయాలన్నారు. ముస్లిం సంఘాలన్నీ ఏకమై బీజేపీని ఓడించేందుకు కుట్రలు చేశా యన్నారు. కాంగ్రెస్‌కు సవాల్ విసురుతున్నా.. ప్రజలంతా కాంగ్రెస్ పక్షాన ఉన్నారని భావిస్తే తక్షణమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ దమ్మేందో చూపిస్తామ న్నారు. చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన పార్టీ నాయ కులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమారి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం..

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి


కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా పెండింగ్‌లో వున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఎమ్మెల్సీ గెలిచిన సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎంతో కాలంగా ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యలో ముఖ్యమైనవి సీపీఎస్ రద్దు, ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలు, సర్వీస్ రూల్స్ వంటి ప్రభుత్వం విడుదల చేసే వర కు పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, కిషన్, యాదగిరి, ఆనందరావు ఉన్నారు.

ఎం ఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిసెంబరు 2024లో నిర్వహించిన ఎం ఫార్మసీ, రెండు, నాలుగవ, సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేశ్‌కుమార్ విడుదల చేశారు. ఈ ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కొండగట్టులో టెండర్లు

మల్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ఆలయానికి కూరగాయలు, పాలు, పెరుగు, స్టేషనరీ, సానిటేషన్, పూలు పండ్లు సరఫరా చేసేందుకుగాను తక్కువ కోడ్ చేసిన కొటేషన్స్‌ను స్వీకరించినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. గుట్ట కింద గల దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లలోని 54 షాప్‌లకు వేలం నిర్వహించగా రెండు దుకాణాలకు సరైన పాట రాలేదన్నారు. వాటి వేలం వాయిదా వేశామన్నారు. వేలం జరిగిన వాటి ద్వారా దేవస్థానంకు రూ.11 లక్షల 61వేల 980 ఆదాయం సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు.

హస్తినలో మెరిసిన సిరిసిల్ల చీర




ఢిల్లీలో హరిప్రసాద్ స్టాల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్రపతికి హరిప్రసాద్ అందించిన జ్ఞాపిక

రాష్ట్రపతి భవన్‌లో చీరల ప్రదర్శన

సిరిసిల్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాజన్న సిరిపట్టు, పట్టు పీతాంబురం, అగ్గిపెట్టెలో చీర మెరిసింది. బుధవారం ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ తాను రూపొందించిన చీరలతో స్టాల్‌ను నిర్వహించారు. తెలంగాణ నుంచి దాదాపు 20 మంది నేత కళాకారులు స్టాళ్లను ఏర్పాటు చేశారు. అందులో అగ్గిపెట్టెలో అమిరే విధంగా నేసిన చీర, కనుమరుగై పోతున్న పట్టు పీతాంబురం సిరిసిల్లకు మోడల్‌గా నిలిచిన రాజన్న సిరిపట్టు చీరలు ప్రత్యేకంగా నిలిచాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్టాల్‌ను సందర్శించి అగ్గిపెట్టెలో చీర వంటివి పరిశీలించి అభినందించారు. చిన్న మగ్గంపై రాష్ట్రపతి చిత్రంతో నేసిన జ్ఞాపికను చూసి అబ్బురపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్రం ప్రభుత్వం చేపట్టిన ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా రాష్ట్రపతి భవన్‌లో ఈనెల 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిరిసిల్ల నుంచి హరిప్రసాద్‌తో పాటు పద్మశ్రీ పురస్కార గ్రహీతలు గజం అంజయ్య, గోవర్ధన్‌తో పాటు 20 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్‌వర్మ, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు


ధ్రువపత్రాలు అందుకున్న యువతులతో విద్యాసాగర్‌రావు

రాయికల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ యువతకు వృత్తి, విద్య, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాల ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యా సాగర్‌రావు అన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఉపాధి కోర్సులు హోం ఎయిడ్, హెల్త్ నర్సింగ్, ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ధ్రువీక రణ పత్రాలు అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మండలంలో నిరుద్యోగ యువత కోసం నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఇందుకు కార్పొరేట్ సంస్థలు సోషల్ రెస్పాన్సబులిటీ తీసుకుని పేద యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రోగ్రాం అధికారి మొయ్య మహేష్, ప్రతిమ ఫౌండేషన్ మార్కెటింగ్ మేనేజర్ కౌశిక్, ఫౌండేషన్ మేనేజర్ వంగ గీతారెడ్డి, చిన్నజీయర్ ట్రస్ట్ ఇన్‌చార్జి ఏఎం రాజురెడ్డి, ఫౌండేషన్ ప్రతి నిధులు రాజరెడ్డి, రఘుపతి, శ్యామల పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన

మండలంలోని ఇటిక్యాలని నివేదిత వృద్ధాశ్రమాన్ని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు సందర్శించారు. వృద్ధులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎల్ పార్శిల్ వైస్ చైర్మన్ హిమవంతరావు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: నిరుద్యోగ యువత నైపుణ్య శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని అమ్మక్కపేట గ్రామ శివారులోని ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో బ్యాంకింగ్, సోలార్, ఏసీ టెక్నీషియన్ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు విద్యాసాగర్ రావు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ కుమార, స్థానిక ప్రాజెక్ట్ మేనేజర్ వేణుగోపాల్, ప్రతిమ ఫౌండేషన్ మేనేజర్ కౌశిక్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గీతరెడ్డి, మండల కో ఆర్డినేటర్ విజయ,బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, నాయకులు చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, ముత్యంరెడ్డి, భూమరెడ్డి పాల్గొన్నారు.

బైక్‌లు ఇలా.. భక్తులు రావడం ఎలా..?




పార్కింగ్‌ను తలపిస్తున్న ఆలయ ప్రాంగణం

ఇబ్బందులు పడుతున్న రాజన్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులు సేద తీరేందుకు వేయించిన చలువ పందిళ్ల కింద వాహనాల పార్కింగ్‌లా మారింది. దీంతో తాము సేదతీరేదేలా అని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాశివరాత్రి జాతర సమయంలో ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం చలువపందిళ్లను అధికారులు వేయించారు. అయితే ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, లోకల్ భక్తులు దర్శనానికి ద్విచక్ర వాహనాలపై వస్తే పార్కింగ్ చేసుకునేందుకు ఆలయ పీఆర్వో కార్యాలయం సమీపంలోని కట్టపైన సౌకర్యం ఉంది. కాగా పీఆర్వో కార్యాలయం సమీపంలోని శ్రీపార్వతి దేవి అమ్మవారి దేవాలయం సమీపంలో చెక్ పోస్టును దాటి ద్విచక్ర వాహనాలు ఈవో కార్యలయం నుంచి లడ్డూల తయారీ కేంద్రం ముందు వరకు తీసుకువచ్చి పార్కింగ్ చేస్తున్నారు. మరికొంత మంది కాంట్రాక్టరులు ఒక్కోసారి ధర్మగుండం వరకు తమ ద్విచక్రవాహనాలను తీసుకు వెళుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. చలువ పందిళ్ల కింద వాహనాలు పార్కింగ్ చేయడంతో నడిచే మార్గంలో భక్తులు సేదతీరాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా జాతర గ్రౌండు, గుడి చెరువు పార్కింగ్ స్థలంలో తమ వాహనాలను నిలిపి కల్యాణకట్ట మీదుగా రాజన్న ఆలయంలోకి వచ్చే క్యూలైన్‌ల సమీపంలో సైతం భక్తులు వచ్చే మార్గంలో అడ్డుగా ద్విచక్రవాహనాలు నిలుప డంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఉద్యోగుల కోసం గుడిచెరువులో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి వాహనాలు అక్కడే నిలుపుకునే చేసేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా వాహనాలను లోనికి అనుమతించకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ధర్మగుండంలోని నీటి తొలగింపు

నల్లాల ద్వారా భక్తులు సాన్నాలు చేసేలా ఏర్పాట్లు


ధర్మగుండంలో తొలగించిన నీరు

వేములవాడ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయలో ధర్మగుండంలోని నీటిని అధికారులు తొలగించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని 2 లక్షలకు పైగా భక్తులు ఆలయానికి తరలివచ్చి ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. దీంతో నీరు రంగు మారి దుర్వాసన రావడంతో ఆలయాధికారులు నీటిని తొలగించి శుభ్రపరుస్తున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించేందుకు వీలు లేకపోవడంతో తాత్కాలికంగా ధర్మగుండం పక్కనే ఏర్పాటు చేసిన నల్లల ద్వారా భక్తులు పవిత్ర స్నానాలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ధర్మగుండంను పూర్తిగా శుభ్రపరిచి త్వరలోనే కొత్తనీటితో నింపి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆలయాధికారులు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఎగువ ప్రాంతానికి సాగునీరు..

ఎల్లారెడ్డిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట జలాశయం నుంచి అధికారులు సాగు నీటిని విడుదల చేయడంతో మండలంలోని ఎగువప్రాంతానికి బుధవారం నీరుచేరుకుంది. మండలంలోని అక్కపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట గ్రామాలశివారులో ఉన్న 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీరు ప్రవహిస్తోంది. రైతులు సాగుచేసిన వరి పొలాలు ఎండిపోతుండడంతో స్పందించిన ప్రభుత్వం, అధికారులు నీటి విడుదలకు చర్యలు చేపట్టారు. కాల్వ నుంచి సాగునీరు చేరుతుండడం వల్ల రైతులు వరి పొలాలకు నీరందించే పనుల్లో నిమగ్నమయ్యారు.

పౌష్టికాహారంపై అవగాహన

వీర్నపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పీహెచ్‌సీ హెల్త్ సూపర్వైజర్ ఇందిరా అన్నారు. మండలంలోని గర్జనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, చిరు ధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ గురించి బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు మంజుల, ఇందిర, అంగన్‌వాడీ టీచర్ సుశీల, ఉపాధ్యాయులు గజన్‌నాయక్, ఆశా వర్కర్లు నవత, సావిత్రి, జమున పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడికి విప్ పరామర్శ

చందుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ తండ్రి రాజయ్య మృతిచెందగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. రాజయ్య భౌతికాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నాయకులు నాగం కుమార్, మల్లేశం, మల్లారెడ్డి, పద్మ, సత్తయ్య, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సేవలకు గుర్తింపు..

కోనరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల మున్నూరు కాపు సంఘానికి చేసిన సేవలు గుర్తించి సంఘం నాయకులు బుధవారం సాగర్ల దేవయ్యను సత్కరించారు. 30 సంవత్సరాలుగా సంఘానికి కోశాధికారిగా పనిచేసి అనారోగ్యానికి గురికాగా భరోసా ఇచ్చి సత్కరించారు. దండు విష్ణు, బుధం చంద్రమౌళి, కాసర్ల లక్ష్మీనారాయణ, దేవేంద్రం అంజయ్య, శ్రీనివాస్, వెంకటేష్, వెంకన్న తదితరులు ఉన్నారు.

నియామక పత్రం అందజేత

కోనరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా పల్లం అన్నపూర్ణను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తెలిపారు. మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణను జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా నియమించి పత్రాన్ని అందజేశారు బీజేపీ నాయకులు మిరియాల్‌కార్ బాలాజీ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గంభీరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం పెద్దమ్మ బస్ స్టేజీ వద్ద నాగంపేటకు చెందిన త్రినేత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ శ్రీకాంత్ బుధవారం ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం నాగంపేట త్రినేత్ర స్వచ్ఛంద సంస్థ వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో త్రినేత్ర స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ గద్దల గణేష్, ప్రధాన కార్యదర్శి బిట్ల దేవరాజు, మాజీ ఎంపీటీసీ నాగభూషనం, స్నేహ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు భూమ రాజం, నాయకులు సత్యం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం

- జిల్లాలో 4,064 మంది విద్యార్థులకు 3,932 మంది హాజరు - 132 మంది విద్యార్థుల గైర్హాజరు

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సిరిసిల్లలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



వేములవాడలో విద్యార్థిని తనిఖీ చేస్తున్న అధికారులు

సిరిసిల్ల రూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియేట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 4064మంది విద్యార్థుల కోసం 16పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయగా, 3932 మంది విద్యార్థులు హాజరుకాగా, 132మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 3551 మందికి 3470మంది హాజరుకాగా 81మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 513మంది విద్యార్థులకు 462మంది హాజరుకాగా 51మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి వెళ్లేముందు తనిఖీలు చేసిన తర్వాత అనుమతించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు సహస్ర, సాయిశ్రీ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించడంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు, పనితీరును పరిశీలించారు. అనంతరం పరీక్షా కేంద్రంలోని రూములను పరిశీలించి, పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్షా కేంద్రంలో కల్పించిన ఫర్నీచర్, తాగునీరు, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి శ్రీనివాస్, సెస్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనజకుమారీ, అధికారులు పాల్గొన్నారు.

● వేములవాడ : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం వేములవాడ పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం అధికారులు వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, వివేకానంద, సుమిత్ర కళాశాలలోని పరీక్ష కేంద్రాలలో మొత్తం 805 మంది విద్యార్థులకు 46 మంది గైర్హాజరుకాగా 759 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్‌గా ఆర్ శేఖర్, డీవోగా శంకరయ్య, వివేకానంద కళాశాలలో సీఎస్‌గా సత్యనారాయణ, డీవోగా చంద్రమౌళి, సుమిత్ర కళాశాలలో సీఎస్‌గా లత, డీవోగా కృష్ణ వ్యవహరించారు.

● ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ప్రథమ సంవత్సరంలో 259మంది విద్యార్థులకు 250 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్‌సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● ఎల్లారెడ్డిపేట : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఎల్లారెడ్డిపేట మండలంలో బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు జరిగాయి. మండల కేంద్రంతోపాటు గొల్లపల్లిలోని ప్రభుత్వ జూనియర్, రాచర్ల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో మొత్తం 386 మంది విద్యార్థులకు 377 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 9మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్లు పర్శరాములు, కనకయ్యలు తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ఉండడంతో విద్యార్థులు ఉదయం 7.45గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్ వద్ద విద్యార్థులను తనిఖీలు చేసి 8.10 గంటలకు లోనికి అనుమతించారు. హాల్‌టికెటు నంబర్లను చూసుకునేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 188 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 4 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రాచర్ల జూనియర్ కళాశాలలో 198 మందికి 5 మంది విద్యార్థులు పరీక్షలు రాయలేదు. వైద్యాధికారులు పరీక్ష కేంద్రాల ఆవరణలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ విధించామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.



ఎల్లారెడ్డిపేటలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

● రుద్రంగి : మండల కేంద్రంలోని కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలుచేశారు. ప్రథమ సంవత్సరంలో 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 127మంది విద్యార్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని అధికారులు తెలిపారు.

● గంభీరావుపేట : గంభీరావుపేటలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 331 మంది విద్యార్థులకు 9 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు.

ఎండిపోతున్న పంటలను పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి



పెద్ద కాలువ ఆయకట్టు పంటలను పరిశీలిస్తున్న గోపి

గంభీరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట సింగ సముద్రం నాలా పెద్ద కాలువ కింద ఎండిపోతున్న పంటలను బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పరిశీలించారు. ఆయకట్టు కింద ఉన్న 2000 ఎకరాల్లో ఇప్పటికే 500 ఎకరాల పంటలు సాగు నీరందక ఎండిపోయే దశకు చేరడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి రైతులతో కలిసి సందర్శించారు. ఎండిపోయే దశకు చేరిన పంటలను పరిశీలించి, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పంటలకు నీరందకు రైతులు పడుతున్న ఇబ్బందుల అంశాన్ని అధికారులతో చర్చించారు. కాలువలో పేరుకపోయిన ముళ్ళపొదలు, పిచ్చిమొక్కలు, పూడికను తొలగించుకుంటున్నామని రైతులు వపోయారు. ఇప్పుడున్న పరిస్థితిలో సాగునీరు అందకపోతే పంటలు మొత్తం ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద కాలువకు ప్రత్యేకంగా తూం ఏర్పాటుచేయాలని, అదేవిధంగా పంటలు ఎండిపోకుండా నీరందేలా చూడాలని రైతులు వివరించారు. అధికారులు పంటలకు సాగు నీరు అందించి, పంటలు ఎండిపోకుండా చూడాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని గోపి వెల్లడించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, కోడె రమేష్, రైతులు ఉన్నారు.

రైతులు దీక్ష చేస్తున్నా పట్టించుకోరా..?



రైతుల దీక్షకు మద్దతు తెలుపుతున్న గోపి

ఇల్లంతకుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎండిపోతున్న పంటలకు సాగునీరు ఇవ్వాలని రైతులు దీక్షలు చేస్తున్నా పట్టించుకోరా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డవేని గోపి ప్రశ్నించారు. సాగునీటి కాలువ పనులు పూర్తి చేయాలని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష బుధవారం మూడు రోజుకు చేరుకుంది. రైతులకు సంఘీభావం ప్రకటించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా అసంపూర్తిగా ఉన్న ఎల్ఎం 6 కాలువ పనులు వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కేవలం 2 కిలోమీటర్ల కాలువ పూర్తి చేస్తే 9500 ఎకరాలకు ప్రయోజనం ఉంటుందన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ దృష్టికి సమస్యను తీసుకపోయి రైతులకు న్యాయం చేస్తామన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కాసుగంటి రాజు, మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్, తంగళ్లపల్లి మండల శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ముస్తాబాద్ మండల ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు, కార్తీక్‌రెడ్డి, సందవేని రాజు, కరికె నవీన్, అమ్ముల అశోక్‌యాదవ్, జంగిటి మోహన్, కమలాకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

- బీజేపీ నాయకుడు ప్రతాపరామకృష్ణ



సైన్స్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ ఎక్స్‌పోలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన సైన్స్ ఎక్స్‌పో-2025 కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎన్నుకున్న రంగాలలో విజయం సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. పాఠశాల నిర్వాహకులు సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసి వారి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయడం అభినందనీయమన్నారు. సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రతాప రామకృష్ణవిద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఎన్ పద్మలత, పాఠశాల కరస్పాండెంట్ శ్రీసన్నిధి వెంకటకృష్ణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● కోనరావుపేట మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తన్‌పేట మార్గదర్శి పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. విద్యార్థులు చేసిన వివిధ రకాల పరికరాలను పరీక్షించి కరస్పాండెంట్ చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న ప్రభుత్వ విప్

వేములవాడ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ కల్యాణోత్సవానికి బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హజరయ్యారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆయన వెంట గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

- సాగు నీరు విడుదలపై రైతులు, నాయకుల సంబరాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి కోనరావుపేట మండలం మల్కపేట జలాశయంకు సాగు నీటిని విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని నాయకులు, రైతులు బుధవారం సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేక చేశారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని, కాపాడుకునేందుకు మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా ఎగువ ప్రాంతానికి నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, గిరిధర్‌రెడ్డి, సాహెబ్, బాబు, గౌస్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, గణపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్‌పై విద్యార్థులకు అవగాహన



థైరాయిడ్‌పై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

గంభీరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట కేజీ టూ పీజీ ఇన్‌స్టిట్యూషన్‌లో బుధవారం థైరాయిడ్‌పై అవగాహన కల్పించారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో అయోడిన్‌పై అవగాహన నిర్వహించారు. ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా, ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా కళాజాతా ప్రోగ్రాం నిర్వహించి, అయోడిన్ లోపం ద్వార యుక్త వయస్సు మహిళలు, పిల్లల్లో మందబుద్ధి, శారీరక ఎదుగుదల లోపిస్తుందన్నారు. గాయిటర్, థైరాయిడ్‌వంటి రుగ్మతలు వస్తాయని అందుకు ప్రజలు, విద్యార్థులు అయోడిన్ ఉన్న సీ ఫుడ్ అయినట్టు వంటి చేపలు, రొయ్యలు, కూరగాయలు, పాలు, నాణ్యమైన పౌష్టికాహారం, మంచి భోజనం తీసుకోవాలని కళాజాతా ప్రోగాం దారా వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, కోఆర్డినేటర్లు రాజశేఖర్, సంగీత, లక్ష్మన్, రమ్య, తినుపతి, ఓంకార్ కళాజాతా బృందం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూల్‌ను సందర్శించిన విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ఉన్నత పాఠశాల విద్యార్థులు పీఎంశ్రీ పథకంలో భాగంగా మండలంలోని దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం సందర్శించారు. తరగతి గదులు, గ్రంధాలయం, సైన్స్ ల్యాబ్, మ్యూజిక్, ఆర్ట్, కంప్యూటర్, జిమ్, డైనింగ్ హాలును పరిశీలించారు. అక్కడి విద్యార్థులు అందిస్తున్న బోధన విధానం, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణహరి, హెచ్‌ఎం మధుమాలతీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భరత్, భాస్కర్, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' తరలిరావాలి

వేములవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడారి రాములు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28న ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరావాలని కోరారు. భవన నిర్మాణ రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గాజుల పోశెట్టి, ఎల్ల దేవరాజు, కుమ్మరి లక్ష్మణ్, విక్రమ్, కనకయ్య, లింగం పాల్గొన్నారు.

రైతుల ఉసురు తగులుతుంది..

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్) మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో రైతులను ఇబ్బందులకు గురిచేసిన మాజీ మంత్రి కేటీఆర్‌కు రైతుల ఉసురు తగులుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాల్లం ప్రవీణ్ కుమార్ అన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల రైతాంగంపై కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నాడన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోలేదన్నారు. తంగళ్లపల్లి మండలంలో ఏ ఒక్క గ్రామంలో కూడా కాలువలు నిర్మించిన దాఖలాలు లేవన్నారు. 9, 10వ ప్యాకేజీలను నిర్వీర్యం చేసి రైతుల పొట్ట కొట్టాడన్నారు. సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నేరెళ్ల నర్సింగంగౌడ్, పుర్మాణి రాంలింగారెడ్డి, మోర రాజు, బైరినేని రాము, ఇటిక్యాల మహేందర్, మోర రాజు, లింగాల భూపతి,పెద్దూరి తిరుపతి, పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

గంభీరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం రాత్రి బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించడంపై టపాసులు కాల్చుతూ, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్,జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చ అధ్యక్షుడు కోడె రమేష్, నాయకులు లక్ష్మీపురం రాజు, సత్యనారాయణ, మల్లేశంయాదవ్,శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, రాజిరెడ్డి, స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు

- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



నిమ్మపల్లి ఎస్సీ కాలనీలో అధ్వానంగా మారిన సీసీ రోడ్డు

కోనరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నిధులు మంజూరు అయినప్పటికీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీ 6వ వార్డులో గతంలో నిర్మించిన సీసీ రోడ్డు చెడిపోయి అధ్వానంగా మారింది. ఈ విషయమై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి గ్రామస్థులు తీసుకపోగా స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2లక్షల నిధులు మంజూరుచేసి భూమిపూజ చేశారు. కానీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీనివల్ల కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టరు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేలా పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో పనులు ప్రారంభిస్తాం..

- మానుక సత్యం, కాంగ్రెస్ నాయకుడు, నిమ్మపల్లి



గ్రామంలోని 6వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రూ.2లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే దృష్టి కి తీసుకువెళ్లి పనులు ప్రారంభించేలా కృషి చేస్తాం.

ఎండుతున్న పంట పొలాలు

- పశువులకు మేతగా మారుతున్న వైనం

వీర్నపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వరిపంట పొలాలకు నీరు అందక పొట్ట దశలోనే ఎండిపోయి పశువులకు మేతగా మారుతున్న పరిస్థితులు వీర్నపల్లి మండలం మద్దిమల్లలో నెలకొన్నాయి. చేతికొచ్చిన వరి పంటకు సరైన సమయంలో నీరు అందకపోవడంతో రైతన్నలు ఇబ్బందిపడుతున్నారు. కొన్నిచోట్ల భూములు ఎండిపోవడంతో వరి పైరులో పశువులను మేపుతున్నారు.

ప్రకృతి వనాలపై పట్టింపు కరువు

- నీళ్లు లేక ఎండిపోతున్న చెట్లు..

- నిండిన చెత్తచెదారం..

కోనరావుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఆహ్లాదాన్ని పంచేందుకు గత ప్రభుత్వం ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కానీ ప్రకృతి వనాలను పట్టించుకునే వారు లేకపోవడంతో చెట్లన్నీ ఎండిపోవడమే కాకుండా చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. కోనరావుపేట మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 28గ్రామాల్లో ప్రతి గ్రామానికి ప్రకృతివనం ఏర్పాటుకు భూమి కేటాయించి సుమారు 3 లక్షల రూపాయల నిధులను గత ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ నిధులతో ప్రతి గ్రామంలో ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. కొన్ని రోజులపాటు ప్రకృతి వనాల్లో ఏర్పాటు చేసిన మొక్కలను కాపాడుతూ పెంచుతూ వచ్చారు. ఆ తర్వాత ప్రకృతి వనాలపైన అధికారులు దృష్టి సారించకపోవడంతో పెరిగిన చెట్లు ఎండిపోవడమే కాకుండా విరిగిపోయాయి. వనమంతా చెత్తాచెదారంతో నిండిపోయింది. ఆహ్లాదం పంచే విధంగా ఉండాల్సిన ప్రకృతి వనాలు కళ తప్పిపోయి అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రకృతివనాలపై దృష్టి సారించి వేసవిలో చెట్లు ఎండిపోకుండా చూడాలని, చెత్తను శుభ్రం చేయించాలని మండలప్రజలు కోరుతున్నారు.



నిజామాబాదులో ఏర్పాటు చేసిన ప్రకృతి వనం

చెట్లన్నీ ఎండిపోతున్నాయి..

- దొబ్బల ప్రకాష్, సుద్దాల



ప్రకృతి వనాల్లో ఏర్పాటు చేసిన చెట్లు నీళ్ల ఎండిపోతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్తాచెదారంతో వనాలన్నీ నిండిపోయి అపరిశుభ్రంగా మారాయి. ఇప్పటికైనా వనాల్లో ఉన్న చెత్తను శుభ్రం చేసి వేసవిలో చెట్లను కాపాడాలి.

ఎవరూ పట్టించుకోవడం లేదు..

- కాదాసు సుధాకర్, సుద్దాల



ప్రకృతి వనాలను అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. చెట్లు ఎండిపోవడమే కాకుండా వనాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు చెత్త తొలగింపుతో పాటు చెట్లకు నీళ్ల అందేవిధంగా చర్యలు చేపట్టాలి.